సాక్షి సిద్దిపేట

ఆదివారం । 7 । జనవరి । 2024



వయోజన 'మిథ్య'!

గ్రామీణ వయోజనులకు అక్షరాలు నేర్పించి విద్యావంతులను చేసే సాక్షర భారత్ కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

వివరాలు 8లో ▸



ఆలయాల్లో చోరీలు

వేర్వేరు ప్రాంతాల్లోని రెండు ఆలయాల్లో శనివారం దొంగలు చోరీకి పాల్పడ్డారు.

వివరాలు 8లో ▸

3,76,387 దరఖాస్తులు

ముగిసిన ప్రజాపాలన కార్యక్రమం

సిద్దిపేటరూరల్: అభయహస్తం పేరుతో 5 గ్యారంటీల అమలుకై చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా శనివారం నాటికి 3,76,387 దరఖాస్తులను ప్రజలు అందజేశారు. జిల్లాలోని 499 గ్రామాలు, 5 మున్సిపాలిటీల్లోని 115 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోతరగతి ఫలితాల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన కార్యాలయంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, వంగ మహేందర్ రెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆస లక్ష్మణ్, ముత్యాల సురేందర్‌రెడ్డి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకే డబుల్ బెడ్‌రూమ్‌లను అందించాలి

సాధన కమిటీ కన్వీనర్ ఎల్లయ్య



వినతిపత్రం అందజేస్తున్న ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: పేదలకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించాలని డబుల్ బెడ్‌రూమ్ సాధన కమిటీ కన్వీనర్ ఎల్లయ్య కోరారు. ఈ మేరకు ఆయన శనివారం గజ్వేల్‌లో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఉన్నవారికే ఇళ్లు కేటాయించిందని, 30 ఏళ్లుగా ఎంతో మంది పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపి అర్హులైన వారికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయిని యాదగిరి, నర్సింలు, పద్మ, కవిత, అనిత, లక్ష్మి, మహేందర్, శివ, సంపత్, యాదగిరి, సత్తయ్య పాల్గొన్నారు.

సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా వెంకట నర్సయ్య



వెంకట నర్సయ్య

అక్కన్నపేట(హుస్నాబాద్): కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయ సైక్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే తెలంగాణ సైక్లింగ్ పురుషుల జట్టుకు మేనేజర్‌గా అక్కన్నపేట మండలం మల్లంపల్లి ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు జంగపల్లి వెంకట నర్సయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని విజయపురంలో ఈ నెల 9 నుండి 12వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. నర్సయ్య నియకంపై పలువురు ఉపాధ్యాయులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఆరు గ్యారంటీలపై ప్రజల సంతోషం



మాట్లాడుతున్న మహేందర్‌రావు, నరసింహారెడ్డి

సిద్దిపేటకమాన్: సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామనడంపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం పండగలా కొనసాగిందని పీసీసీ సభ్యుడు గంప మహేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచడం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ నేతృత్వంలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నామినేటెడ్ పోస్టులు ఇస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ఉపాధ్యక్షుడు ఖలీమోద్దీన్, సీనియర్ నాయ కులు అంజయ్య, రాజబహదూర్‌రెడ్డి, షాబోద్దీన్, మహిపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, హర్షద్, సీతాబాలు, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లన్న కల్యాణం

- కొమురవెల్లి తోటబావి వద్ద ఏర్పాట్లు పూర్తి
- సర్వాంగ సుందరంగా పరిసరాలు
- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రులు సురేఖ, పొన్నం



తోటబావి ప్రాంగణంలో సిద్ధమైన కల్యాణ వేదిక

కొమురవెల్లి(సిద్దిపేట): భక్తుల కొంగుబంగారం కొమురవెల్ల మల్లికార్జున స్వామి మేడాలదేవి, కేతమ్మదేవిల కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణానికి రాష్ట్రం నలుమూలల నుంచే గాక పరిసర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. అందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. కొమురవెల్లిలోని ఆలయ తోటబావి వద్ద గల కల్యాణ మండపాన్ని సుందరంగా అలంకరించారు. ఉదయం 10.45 గంటలకు స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం వీరశైవ ఆగమ శాస్త్ర సంప్రదాయం ప్రకారం జరగనుంది. ఈతంతు ఉజ్జయిని పీఠాధిపతి 1008 జగద్గురు సిదలింగ రాజదేశి కేంద్ర శివాచార్య స్వామి పర్యవేక్షణలో స్థానిక పూజారుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించనున్నారు.

స్వామి తరపున పడిగన్నగారి వంశస్తులు

మొదట ఆలయ గర్భగుడిలో మల్లన మూల విరాట్టు వద్ద కల్యాణ తంతును ప్రారంభించి అదే సమయంలో తోటబావి వద్ద ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపిస్తారు. ఈ కల్యాణ మహోత్సవంలో వధువు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మ తరపున మహదేవుని వంశస్తులు పాల్గొంటారు. వరుడు మల్లికార్జునస్వామి తరపున పడిగన్నగారి వంశస్తులు పెండ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు

ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు ముందు జరిగే మల్లన్న కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. స్వామివారి కల్యాణాన్ని నిర్వహించేందుకు తోట బావి ప్రాంతంలో గ్రిల్స్‌వేసి పందిళ్ల సిద్ధం చేశారు. స్వామి వారి టేకు రథం పనులు, గుట్టపైన ఎల్లమ్మ ఆలయ అలంకరణ పనులు పూర్తి చేశారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఈఓ బాలాజీ, ఏఈఓ అంజయ్య పర్యవేక్షిస్తున్నారు.

రతి బియ్యం సేకరణతో కల్యాణ తంతు ప్రారంభం

మల్లన్న కల్యాణం సందర్భంగా ఆదివారం తెల్లవారు జామున జరిగే దృష్టి కుంభాలలో వినియోగించేందుకు రతి బియ్యాన్ని ఊరేగింపుగా ఆలయ అర్చకులు శనివారం రాత్రి సేకరించారు. ఆ బియ్యానికి ప్రత్యేక పూజలు చేసి మల్లన్న తొలి దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఇంట్లో వీరభద్రుని ఖడ్గం, పళ్ళెరముకు ప్రత్యేక పూజలు నిర్వహించి దండకాలు వేస్తూ రతి బియ్యం సేకరించారు. అనంతరం అర్చకులు బియ్యాన్ని ఆలయానికి చేర్చారు.

> **ఏర్పాట్లన్నీ పూర్తిచేశాం**
>
> 
>
> స్వామి వారి కల్యాణం వీక్షించడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. సుమారు 30 వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో సరిపడా లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేయించాం. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో సర్వం సిద్ధం చేశాం.
>
> – బాలాజీ, ఆలయ ఈవో

కొలువుదీరిన నూతన పాలక మండలి

కొమురవెల్లి మల్లన్న ఆలయ పాలక మండలి శనివారం ప్రమాణస్వీకారం చేసింది. శుక్రవారం దేవాదాయ శాఖ 20 మంది ధర్మకర్తలతో నూతన కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయగా.. శనివారం వారితో ప్రమాణ స్వీకారం చేయించి.. నూతన చైర్మన్‌గా లక్ష్మారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



కొలువుదీరిన నూతన పాలక మండలి

కుట్రలతో కౌన్సిల్‌ను చీల్చలేరు

- దుష్ప్రచారం చేయొద్దు
- బల్దియా కౌన్సిల్ సభ్యులు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ అమలు హామీ నుంచి ప్రజలను ఏమార్చే క్రమంలో కౌన్సిల్‌పై దుష్ప్రచారం చేస్తోందని, కుట్రలతో మున్సిపాలిటీని కాంగ్రెస్ చీలల్చలేదని సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గ సభ్యులు స్పష్టం చేశారు. శనివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు సహచర కౌన్సిల్ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని, అలాగే బల్దియా చైర్మన్ అవిశ్వాస తీర్మానంపై వస్తున్న ఊహాజనిత కథనాలన్నీ సత్యదూరం అని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌కు పెద్దన్న లాంటి రాజనర్స్ కుటుంబం మీద నమ్మకంతో కౌన్సిల్ సభ్యులు ఏకతాటితో ఉన్నామని చెప్పారు. అవిశ్వాసం పెట్టే ఆలోచన, అవసరం తమకు లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం లేనప్పటికీ సిద్దిపేటలో గులాబీ జెండా ఎగురవేశామని, కౌన్సిల్ ఎప్పుడూ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆలోచన, లక్ష్యం మేరకు పనిచేస్తుందని స్పష్టం చేశారు. కొంత మంది కౌన్సిలర్లు నూతన సంవత్సర వేడుకలను హైదరాబాద్‌లో జరపడానికి వెళితే అవిశ్వాసం కోసం సమావేశం అంటూ అసత్య లీకులు ఇచ్చారని, అది ఒక దుష్ప్రచారంగా కౌన్సిల్ సభ్యులు అభివర్ణించారు. ఎన్నికల ముందు సిద్దిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ చేసిన ట్రిక్స్ మళ్ళీ ఇప్పుడు చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కౌన్సిల్ సభ్యులందరూ పార్టీకి విధేయులని, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు విశ్వాస పాత్రులుగా ఉంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట తమకు వేదమని, పార్టీ లైన్ దాటే ఆలోచన, అవసరం లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా తమకు మాత్రం ఇక్కడ హరీశ్‌రావే పెద్ద దిక్కు అని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తి లేదు..

ఆరు గ్యారంటీలు అమలుచేసేంత వరకు కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామన్నారు. మూడు సార్లుగా రాజనర్స్ కుటుంబం చైర్మన్‌గా కొనసాగుతుందని, నిజాయితీ, విధేయత ఉంది కాబట్టి ఆయన నాయకత్వంలో ఉన్నామని చెప్పారు. అవినీతి ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ వాటిని రుజువు చేయాలని, చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాలు విసిరారు.

ప్రజల సహకారం గొప్పది..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిద్దిపేట జాతీయ స్థాయిలో అవార్డు పొందడం వెనుక ప్రజల సహకారం ఉందని కౌన్సిల్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం, అధికారులు, సిబ్బందిని వారు అభినందించారు. సమావేశంలో కౌన్సిలర్లు రవి, ప్రవీణ్, బ్రహ్మం, సుందర్, సాయి ఈశ్వర్, అరవింద్, మల్లికార్జున్, సాయికుమార్, లక్ష్మణ్, విజయ్, నాగరాజు, చంద్రం, శ్రీనివాస్ యాదవ్, వజీర్, యోగి, సతీశ్, వినోద్, నాయకులు తిరుమల్, సురేశ్, ఎల్లం, రాజు, రాజేశం, మహేందర్, రఘురాం, శ్రీహరి, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యులు

ప్రతి ఎకరాకు సాగునీరు: ఎమ్మెల్యే



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్, ఉప్పరపల్లి, రామాయంపేట ఉప కాలువల నిర్మాణం పురోగతిపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ ఉప కాలువల నిర్మాణం పూర్తి కాక పోవడంతో సాగు నీరు అందించడం ఇబ్బందిగా మారిందన్నారు. అవి పూర్తయితే నియోజకవర్గంలో 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పాత రేట్ల ప్రకారం భూములు ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం లేదని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో రైతులందరికీ న్యాయం చేస్తామని నెలాఖరులోగా భూసేకరణ పూర్తి చేయాలన్నారు.

మంత్రి దామోదరకు ఘన స్వాగతం

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధి దౌల్తాబాద్ చౌరస్తాలో శనివారం అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగారెడ్డి నుంచి మెదక్ జిల్లా నర్సాపూర్‌కు వెళ్తున్న ఆయన దౌల్తాబాద్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు మంత్రికి ఘనస్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పీసీసీ మైనార్టీ విభాగం కార్యదర్శి హకీమ్, నాయకులు సుహాసిని రెడ్డి, రవీందర్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, కృష్ణ, వెంకటేశం, ఫయాజ్, సత్యం, సుజాత, రియాజ్, పెంటేష్, గోపాల్, అల్తాఫ్ పాల్గొన్నారు.

నాచగిరిలో ఆధ్యాత్మిక సంరంభం

రెండు రోజులు విశేష కార్యక్రమాలు

వర్గల్(గజ్వేల్): ఆధ్యాత్మికతకు నెలవు నాచగిరి శ్రీరాఘవేంద్ర బృందావనంలో రెండు రోజుల పాటు విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. తెలంగాణ మధ్వమండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు శ్రీజగద్గురు శ్రీమధ్వాచార్యుల మూల మహాసంస్థాన ఉత్తరాధి మఠాధీశులు శ్రీ1008 సత్యాత్మతీర్థ శ్రీపాదుల స్వామి రానున్నారు. ఆదివారం, సోమవారం ఆయన నేతృత్వంలో ప్రత్యేక పూజలుచేసి, ప్రవచనాలు ఇవ్వనున్నారు. తరలివచ్చే భక్తులకు ఏ ఇబ్బందీ కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు రాఘవేంద్ర బృందావన సమితి అధ్యక్షుడు ఉపేందర్‌రావు తెలిపారు.



సిద్ధం చేసిన బృందావన ప్రాంగణం

పేదరిక నిర్మూలనకు చట్టాలు

సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేటఅర్బన్: పేదరిక నిర్మూలనకు రూపొందించిన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. మండలంలోని తడ్కపల్లి గ్రామంలో శనివారం పేదరిక నిర్మూలన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై ఎలాంటి సందేహాలున్నా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ భాస్కర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీకర్‌రెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖజానా ఖాళీగా ఉన్నా.. గ్యారంటీలు అమలు

గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత నాదే: పొన్నం



ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: ఖజానా ఖాళీగా ఉన్నా.. ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడి 30 రోజులు కాకముందే బీఆర్ఎస్ నేతలు 420 అని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో 379, 382, 384, 398 వంటి సెక్షన్ల కింద కేసులు పెట్టినా సరిపోనంత ఖజానా దోపిడీ అని పొన్నం ఆరోపించారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా 2వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు రూ.250 కోట్లు నిధులు అవసరం ఉందన్నారు. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు నీళ్లు అందించే బాధ్యత తనదేనని చెప్పారు. దేవాదుల, శ్రీరాంసాగర్, వరద కాలువ ఫేస్ 2 ద్వారా నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఢిల్లీకి రాజైనా.. మీ బిడ్డనే..

నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి ఓటు వేస్తే ఎమ్మెల్యేగా గెలిచిపార్టీ ఆదేశాలతో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించానని, ఢిల్లీకి రాజైనా మీ బిడ్డలాగే.. ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించే బాధ్యత తనదేనని మంత్రి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజా పాలన కార్యక్రమం కొనసాగిందన్నారు. ఇప్పటి వరకు 85 వేల దరఖాస్తులను స్వీకరించామని, డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా అవసరమైన మరమ్మతుల కోసం ఎస్టిమేట్ చేసి ఇవ్వాలని ఆర్డీఓకు ఆదేశాలు జారీ చేశామని, సంక్రాతి తర్వాత గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హమాలీలు, ఆటో కార్మికులు, రోజు వారి జీవనం గడిపే కార్మికులకు హెల్త్ ప్రొఫైల్ టెస్టులు చేయించి అవసరమైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఏ ప్రాంతానికైనా బస్ సౌకర్యం కావాలని తనకు చెబితే వెంటనే ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బెన్ షాలోమ్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఆదేశం..

కోహెడ(హుస్నాబాద్): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ మండల స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనన్నారు. బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేసీఆర్ ప్రతిపాదిత అధ్యక్షుడే అని ఎద్దేవా చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ విఫలం చెందిందన్నారు. ఆయనకు అంబేద్కర్ చౌరస్తా వద్ద మహేందర్‌రెడ్డి సోదరులు గజమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంద ధర్మయ్య, బస్వరాజు శంకర్, దొమ్మాట జగన్‌రెడ్డి, శెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా..

14వ వార్డులో మంత్రి పొన్నం పార్టీ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. పలువరితో మాట్లాడి వార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ హమాలీ సంఘం కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికుల ఆరోగ్యం కోసం ప్రతి రోజు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ ప్రొఫైల్ చెకింగ్ కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు సరోజన, చిత్తారి పద్మ, వల్లపు రాజు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

దుబ్బాకటౌన్: ముసాయిదా ఓటర్ జాబితాను విడుదల చేశామని అదనపు కలెక్టర్, ఓటర్ నమోదు అధికారిణి గరీమా అగర్వాల్ తెలిపారు. శనివారం దుబ్బాక సమీకృత కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. వారందరికీ ముసాయిదా ఓటర్ జాబితాలను అందజేశారు. ఓటర్ జాబితాపై సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమం పరిశీలన

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గరీమా అగర్వాల్ పరిశీలించారు. సింగారం, ఎర్రవల్లి గ్రామాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఎంపీడీవో మచ్చేందర్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మల్లన్నసాగర్ ప్యాకేజీ, పరిహారం, ప్లాట్లు, డబ్బులు తమకు అందలేదని పలువురు బాధితులు అధికారులకు మొరపెట్టుకున్నారు.



గజ్వేల్‌రూరల్: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అర్జీదారులతో మాట్లాడుతున్న గరీమా అగర్వాల్

క్లుప్తంగా

ఈ- లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ నీరజ



లైబ్రరీని ప్రారంభిస్తున్న వీసీ నీరజ

ములుగు(గజ్వేల్): అత్యాధునికమైన ఈ–లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్.బి.నీరజ ప్రభాకర్ సూచించారు. విశ్వవిద్యాలయంలో పీజీ , పీహెచ్‌డీ విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీ (కంప్యూటర్ సెంటర్)ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో మొట్టమొదటి సారిగా అత్యాధునిక ఈ లైబ్రరీని ఇక్కడ నెలకొల్పడం గర్వంగా ఉందని తెలిపారు. అతివేగమైన కంప్యూటర్లతో సర్వర్ అనుసంధానంతో ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల విద్యార్థులకు ఇంటర్నెట్ సౌకర్యంతోపాటు వివిధ రకాల అభ్యాస వనరులను ఆన్‌లైన్‌లో పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, విజయ, రాజశేఖర్, నటరాజన్ శ్రీనివాస్, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపిక



నిక్షిత

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల కు చెందిన 8వ తరగతి విద్యార్థిని నిక్షిత షాట్‌పుట్ అండర్ -14 క్రీడా విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు. ఉట్నూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని కళాశాల సిబ్బంది అభినందించారు.

భార్య బీడీలు చుడుతూ.. భర్త జిరాక్స్ సెంటర్ నడుపుతూ



ఈ ఫొటో కనిపిస్తున్న ఆమె దూల్మిట మండలం బెక్కల్ గ్రామ కో ఆర్డినేటర్ పేరం కవిత. సాక్షర భారత్ కోఆర్డినేటర్‌గా 10 ఏళ్ల విధులు నిర్వహించింది. వీళ్ల భర్త పేరం మల్లేశం మండల కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వహించాడు. 2017 ఫిబ్రవరి వరకు పని చేసిన వీరిని ప్రభుత్వం తొలగించడంతో ఒకరు మద్దూరులో జిరాక్స్ సెంటర్ పెట్టుకొని ఉపాధి పొందగా, కవిత ఇంటి వద్ద బీడీలు చుడుతూ వచ్చే డబ్బులతో జీవనం కొనసాగిస్తున్నారు. ఉన్నత చదువులు ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రత లేదని వాపోతున్నారు.

సాక్షర భారత్‌పై నీలినీడలు

- విధుల్లో లేని గ్రామ కో ఆర్డినేటర్లు
- ఉపాధి కోల్పోయిన 666 మంది
- 2017 మార్చిలో తొలగించిన ప్రభుత్వం
- విధుల్లోకి తీసుకోవాలని ప్రజాపాలనలో విజ్ఞప్తులు
- పంచాయతీల్లోనే వయోజన విద్య సామగ్రి

వయోజన మిథ్య!

గ్రామీణ వయోజనులకు అక్షరాలు నేర్పించి విద్యావంతులను చేసే సాక్షర భారత్ కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇందులో పని చేసే వీసీఓ (గ్రామ కో ఆర్డినేటర్ల)లను గత ప్రభుత్వం తొలగించి ఐదు ఏళ్లు గడుస్తుంది. కానీ, ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకోలేదు. దీంతో కార్యక్రమం ముందుకు సాగక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. దీని మీదే ఆధారపడి పని చేసిన వీసీఓలు ఉపాధి కోల్పోయి ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారు. మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ప్రజాపాలనలో దరఖాస్తులు అందజేస్తున్నారు.

– హుస్నాబాద్‌రూరల్



పోలీసుల సహకారంతో అక్షరాస్యత కార్యక్రమం నిర్వహిస్తున్న వీసీఓలు (ఫైల్)



జోడో యాత్రలో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వీసీఓలు (ఫైల్)

ఉమ్మడి మెదక్ జిల్లాలో 46 మంది మండల కో ఆర్డినేటర్లు, గ్రామానికి ఇద్దరు చొప్పున సిద్దిపేట జిల్లాలో 620 మంది గ్రామ కో ఆర్డినేటర్లు విధులకు దూరమై ఉపాధి కోల్పోయి ఐదేళ్లు గడుస్తోంది. విద్యాశాఖను నిర్లక్ష్యం చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం సాక్షర భారత్ వీసీఓలను విధుల నుంచి తొలగించింది. ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్లను తొలగించి ఎన్నికల ముందు మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు కానీ సాక్షరభారతి వీసీఓలను మాత్రం పట్టించుకోలేదు.

2017 మార్చిలో తొలగింపు..

సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలని కేంద్ర ప్రభుత్వం వయోజన విద్య ద్వార గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి పుస్తకాలను సరఫరా చేసింది. దీనిని అప్పటి యూపీఏ కేంద్ర ప్రభుత్వం 2010 మార్చి నుంచి సాక్షర భారత్ పేరుతో ఊరూరా గ్రామ కోఆర్డినేటర్లను నియమించి గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విజ్ఞానం పెంచాలనే ఆలోచనతో వయోజన విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టింది. వయోజనులకు అక్షరాలు నేర్పడంతో పాటు గ్రామాల్లో స్వశక్తి మహిళ గ్రూపులను చైతన్యం చేయడం, యువతను సామాజిక సేవ వైపు ప్రోత్సహించడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి వీసీఓలను ప్రభుత్వం వినియోగించుకోంది. 2017 మార్చిలో రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం సామగ్రిని గ్రామ పంచాయతీలకు అప్పగించి వీరిని విధుల నుంచి తొలగించింది. గత ప్రభుత్వం వీరి విజ్ఞప్తులను, విన్నపాలను పట్టించుకోకపోవడంతో ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు కూడా కూలీ పనులకు పోయి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడ్డది.

కొత్త ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రభుత్వం విధుల నుంచి తొలగించడంతో చాలా మంది ఉద్యోగ ఉపాధిని కోల్పోయారు. ఎప్పుడు ప్రభుత్వం మారుతుందా.. మాకు మంచి రోజులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూశారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో మొదటి రోజు మద్దూరు మండల కేంద్రానికి చెందిన కోఆర్డినేటర్ మాకు ఉద్యోగ అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. జిల్లాలో మరికొన్ని గ్రామాల్లో కూడా ప్రజాపాలనలో దరఖాస్తులను చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మాకు ఉద్యోగం ఇవ్వాలి



2010లో సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్‌గా విధుల్లోకి తీసుకున్నారు. 2017 వరకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా వయోజనులకు అక్షరాలను నేర్పించి అక్షరాస్యతను పెంచాం. డిజిటల్ విద్యలో కూడా అందరికి అవగహన కల్పించాం. టీఆర్ఎస్ ప్రభుత్వం మాకు అన్యాయం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా విజ్ఞప్తులను ఆలకించి ఉద్యోగ అవకాశం కల్పించాలి.

– బండి తిరుమల్ రెడ్డి, ఎంసీఓ, హుస్నాబాద్



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు

మల్లన్న కల్యాణానికి పటిష్ట బందోబస్తు

అడిషనల్ డీసీపీ అండె శ్రీనివాస్‌రావు

పోలీసులకు దిశానిర్దేశం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం బందోబస్తుకు వచ్చిన పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. స్వామి వారి కల్యాణ బందోబస్తులో అడిషనల్ డీసీపీలు ఇద్దరు, ఏసీపీలు ముగ్గురు, సీఐలు 12 మంది, ఎస్ఐలు18, కానిస్టేబుల్‌లు మొత్తం 300 సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించి పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను పార్కు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో 80 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తోట బావి సమీపంలో వీఐపీ పార్కింగ్, సిద్దిపేట, చేర్యాల, కిష్టంపేట నుంచి వచ్చే వాహనదారులు బస్టాండ్ పక్కన గల పార్కింగ్ ప్రదేశంలో పార్కు చేయాలన్నారు. కొండపోచమ్మ, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు పెట్రోల్ పంపు, శ్రీ హోటల్ వెనుక గల ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు సతీష్, సురేందర్‌రెడ్డి, రమేష్, రవీందర్ రాజు, ప్రసన్నకుమార్, సీఐలు సత్యనారాయణ రెడ్డి, రఘుపతిరెడ్డి ఎస్‌లు, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

అరగంట వ్యవధిలో తల్లీకొడుకు మృతి

- ఆర్థిక భారంతో కొడుకు హఠాన్మరణం
- విషయం తెలుసుకొని కుప్పకూలిన తల్లి
- తల్లీకొడుకుల మృతితో కూచన్‌పల్లిలో విషాదం



లక్ష్మి, నర్సింహాగౌడ్ మృతదేహాలు

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో కొడుకు మృతి చెందగా ఆ విషయాన్ని తెలిసిన తల్లి తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన విషాదకర ఘటన హవేళిఘణాపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కూచన్‌పల్లి గ్రామానికి చెందిన వీరప్పగారి నర్సింహాగౌడ్(36) ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా ఆటోకి గిరాకీ లేకపోవడంతో కుటుంబాన్ని పోషించడానికి అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువయ్యాయని కుటుంబ సభ్యులకు చెబుతూ బాధపడుతుండేవాడని తెలిసింది. దీంతో శనివారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో తనకు చాతిలో నొప్పి వస్తుందని భార్య లతకు తెలిపి అరగంటలోపే స్పృహ కోల్పోయాడు. దీంతో వెంటనే కుటంబీకులు ఆయనను మెదక్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లి లక్ష్మి(60) అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కుమారుడు మృతి చెందిన అరగంటలోపే తల్లి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు నర్సింహాగౌడ్‌కు భార్య లత, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నాడు.

పరామర్శించిన ఎమ్మెల్సీ శేరి

హవేళిఘణాపూర్ మండలం కూచన్‌పల్లి గ్రామంలో తల్లీకొడుకులు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి మృతుల కుటుంబాన్ని పరామర్శించి సంతాపం ప్రకటించారు.

లింక్ ఓపెన్ చేయగానే ఖాతా ఖాళీ

- సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
- లక్షల్లో పోగొట్టుకున్న బాధితులు
- టాస్క్‌లు, కమీషన్ల పేరుతో మోసం



పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైమ్ జాబ్ అంటూ టెలిగ్రామ్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సూర్యోదయ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైమ్ జాబ్ అంటూ డిసెంబర్ 15 వ తేదీన ఫోన్ టెలిగ్రామ్‌కు మెసేజ్ వచ్చింది. ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతడికి ఒక వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.10 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేయడం మొదలుపెట్టాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.2 లక్షల 9 వేలు చెల్లించాడు. ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం అమీన్‌పూర్ పోలీసులకుఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

రూ. 2 లక్షల 50 వేలు

అమీన్‌పూర్ పరిధిలోని పీజేఆర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆన్‌లైన్ జాబ్ అంటూ నవంబర్ 8వ తేదీన మెసేజ్ వచ్చింది. దీనికి ఉద్యోగి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా టాస్క్‌లు చేస్తూ మొత్తం రూ. 2 లక్షల 50 వేలు నగదు ఇన్వెస్ట్ చేశారు. బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రూ.2 లక్షల 20 వేలు

అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ముకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 12వ తేదీన పార్ట్ టైమ్ జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. ఉద్యోగి తన వివరాలను నమోదు చేసి, అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా నగదు ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.2 లక్షల 20 వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు వచ్చిన కమీషన్ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు. ఉద్యోగి తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పార్ట్ టైమ్ జాబ్ అంటూ మెసేజ్..

అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన ఓ ఉద్యోగికి ఏప్రిల్ 24వ తేదీన పార్ట్ టైమ్ జాబ్ అంటూ మెసేజ్ రావడంతో స్పందించి తను వివరాలను నమోదు చేసి రూ.80 వేలు పోగొట్టుకున్నాడు. మరో ఘటనలో అమీన్‌పూర్ పరిధిలోని నవ్య లేక్ వ్యూకు చెందిన ఓ ఉద్యోగికి పార్ట్ టైమ్ జాబ్ అంటూ డిసెంబర్ 10వ తేదీన మెసేజ్ రావడంతో స్పందించి, తన వివరాలను నమోదు చేసి రూ.20 వేలు పోగొట్టుకున్నాడు. ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, శనివారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

హెల్మెట్ పెట్టుకొని.. క్లిప్పు మరిచి

- రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి
- బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలు



మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, పక్కకు పడిపోయిన హెల్మెట్

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన గోమారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధి సికింద్లాపూర్ గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాస్‌చారి (45) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం స్వగ్రామంలో నర్సరీని పరిశీలించాడు. అనంతరం సికింద్లాపూర్– చిన్నగొట్టిముక్ల ప్రధాన రహదారిలో బైక్‌పై మరో వ్యక్తితో గోమారం వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఓ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌చారి అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ వెనుకాల కూర్చున్న ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో శ్రీనివాస్‌చారి హెల్మెట్ ధరించినప్పటికీ క్లిప్పు పెట్టుకోకపోవడంతో బైక్ పై నుంచి కింద పడగానే హెల్మెట్ తొలగిపోయి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

సిబ్బంది సంతాపం

శ్రీనివాస్‌చారి మృతదేహం వద్ద ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీఓ భారతి, ఏపీఓ అనీల్ కుమార్, ఇతర సిబ్బంది నివాళులర్పించారు.ప్రభుత్వం నుంచి రూ.20 వేలు, ఎంపీపీ హరికృష్ణ రూ.10 వేలు, సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

హత్య కేసులో వ్యక్తి రిమాండ్

పటాన్‌చెరు టౌన్ : అమీన్‌పూర్ మండల పరిధిలోని బీరంగూడ మల్లారెడ్డి కాలనీకి చెందిన నాగేశ్వరరావు(47) మృతి కేసుకు సంబంధించి పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మొదట భార్య ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు, తర్వాత నాగేశ్వరరావు మృతదేహంపై గాయాలు ఉండడంతో హత్యకేసు కింద మార్చారు. కేసు దర్యాప్తులో భాగంగా మృతుడు నాగేశ్వరరావుపై దాడి చేసి సెల్‌ఫోన్ దొంగలించి తీసుకెళ్లిన నిందితుడు శంకర్‌ని లోకేషన్ ఆధారంగా పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలో శుక్రవారం అదుపులో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్ సీతాఫల్‌మండికి చెందిన పాతనేరస్తుడు రాయపురం శంకర్ పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలో ఉంటూ దొంగతనాలు చేస్తుంటాడని తెలిపారు. ఇతడిపై పలు కేసులున్నాయని పేర్కొన్నారు. డిసెంబర్ 21వ తేదీన పట్టణంలోని సాకి చెరువు వద్దకు వచ్చిన నాగేశ్వరరావుతో నిందితుడు శంకర్ గొడవపడ్డాడని తెలిపారు. నాగేశ్వరరావు సెల్‌ఫోన్ లాక్కొని దాడి చేసి పారిపోయినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శంకర్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కడుపునొప్పి భరించలేక..

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



సంతోష (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోలు మండలం డాకూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒగ్గు సంతోష (40) శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మాని యా ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

ముగ్గురు అదృశ్యం

వేర్వేరు చోట్ల శనివారం ముగ్గురు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరులో ఇద్దరు, దుబ్బాకలో ఒకరు కనిపించకుండా పోయారు.



మల్లమ్మ



ఉమేశ్

పటాన్‌చెరుటౌన్: మహిళ అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మొహమ్మద్ ఆలీ కథనం ప్రకారం... పటాన్‌రు మండలం రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మల్లమ్మ(48) 4వ తేదీన కూతురితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లింది. ఎంతసేపు అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి అదృశ్యం పై కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి..

భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లి భర్త అదృశ్యమయ్యాడు. హెడ్ కానిస్టేబుల్ అశోక్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని కుమ్మరి బస్తీకి చెందిన ఉమేశ్ 3వ తేదీన భార్య మంజులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భర్త కోసం మంజుల తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హబ్సీపూర్ గ్రామంలో..

దుబ్బాకరూరల్: ఇంటి నుంచి మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని హబ్సీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ వివరాల ప్రకారం.. మెర్గు భారతమ్మ(55) 5వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం కూతురు సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయాల్లో చోరీలు

- కొల్చారంలో హుండీలు, సౌండ్ బాక్స్‌లు
- అందోల్‌లో విగ్రహం, 30 తులాల వెండి అపహరణ

వేర్వేరు ప్రాంతాల్లో రెండు ఆలయాల్లో శనివారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. కొల్చారంలోని జగదాంబ దేవాలయంలో హుండీల్లోని నగదు ఎత్తుకెళ్లారు.అందోల్ మండల పరిధిలోని దాకూర్ గ్రామంలో శివుడి విగ్రహంతోపాటు వెండి అపహరించుకుపోయారు.



ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల గ్రామపంచాయతీ దుంపలకుంట చౌరస్తా సమీపంలోని జగదాంబ సేవాలాల్ దేవాలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గిరిజనులు తెలిపిన వివరాలు.. పూజల కోసం వచ్చిన భక్తులు రెండు దేవాలయాలకున్న గ్రిల్స్ పగులగొట్టి ఉండడం గమనించి పూజారికి సమాచారం అందించారు. లోనికి వెళ్లి చూడగా దేవాలయంలోని రెండు హుండీలతోపాటు సౌండ్ ఉపకరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కొల్చారం పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ఐ తారాసింగ్ పరిశీలించారు.

దుంపలకుంట చౌరస్తాలో వరుసగా..

దుంపలకుంట చౌరస్తాలో వరుస దొంగతనాలు స్థానికులను భయాందోళనకు గురి చేస్తుంది. మూడు రోజుల క్రితం ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ టైలర్ షాపు షట్టర్ పగులగొట్టి నగదుతో పాటు బట్టలు ఎత్తుకెళ్లినట్లు అక్కడి స్థానికులు తెలిపారు. రంగంపేట గ్రామ శివారులోని టీ బూట్ పాయింట్లు చోరీకి యత్నించిన దొంగలు రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు యజమాని తెలిపారు.

శివుడి విగ్రహం, వెండి అపహరణ

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఆలయ పూజారి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని మాలకుంట కాల్వ వద్ద శివుని విగ్రహానికి సంబంధించిన ప్రతిమ పడి ఉండడాన్ని గ్రామస్తులు గమనించారు. ఆలయంలో వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. శివుడి విగ్రహాలతోపాటు 30 తులాల వెండి వస్తువులు ఎత్తికెళ్లినట్లు పేర్కొన్నారు. జోగిపేట పోలీసులకు సమాచారం అందించగా సీఐ నాగరాజు,ఎస్ఐ అరుణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని చోరీ వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. అక్సాన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్ అక్కడికి వెళ్లి పరిశీలించి చోరీకి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల చెక్‌డ్యామ్‌లో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించి శవాన్ని బయటకు తీశామన్నారు. అక్కడ ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. కుళ్లిపోయిన స్థితిలో ఉండడంతో ఎవరిదో గుర్తించలేదన్నారు. వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం వివరాలు తెలిసిన వారు సంప్రదించాలని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.